
సుఖం అనే మాటకు అర్థం అందరికీ తెలుసు. ఆ సుఖం పట్ల అందరి అభిప్రాయం మాత్రం ఒకటికాదు.




'జీవితం చాలా విచిత్రమైంది' అన్న సాధారణమైన వాక్యంతో నేనీ కథను మొదలుపెట్టదలచు కోలేదు. ఎందుకంటే ఆ వైచిత్ర్యంలో ఎంతో సాధారణత ఉంది. మళ్ళీ అది విచిత్రమయిన సాధారణతే కావచ్చు. సో, జీవితం విచిత్రంగా సాధారణమైంది.

ఇక కథలోకి కాలుపెట్టి కళ్ళు తెరిస్తే—

నా పెళ్ళాం పతివ్రత. ఇది అందరూ అనుకునే మాట. మొదటినుండీ నే గమనించిన దేమిటంటే ఆమె అట్లా అనిపించుకోవాలనే ప్రయత్నించేది. ప్రవర్తించేది. నా కప్పుడప్పుడూ అనుమానమొచ్చేది. ఆ పేరు అట్లా నిల బెట్టుకోవాలన్న తపన వల్ల అంటే— అందరూ ఆమె గురించి అనుకోవడం మూలానే ఆమె అలా ప్రవర్తించేదేమోనని. సామాన్యంగానే ఆమెకు తన ప్రవర్తన మూలాన కాక తనకున్న మంచిపేరు వలన వచ్చే ఆనందం ఎక్కువని అనిపిస్తుంది నాకు.

ఉదయాన్నేలేస్తుంది. శుభ్రంగా స్నానం చేసి దేవుడిముందు కూర్చుని పద్యమో, పాటో పాడుతుంది. ఎప్పుడూ బొట్టుపెట్టు కొనే ఉంటుంది నుదుటా, పాపిడిమధ్యా. అమ్మలక్కలతో కలిసి కబుర్లుచెపుతుంది. నన్ను వెంటపెట్టుకుని ప్రతి శనివారం గుడి కెళుతుంది. పరాయిమగాళ్ళ ఎదుట భుజం చుట్టూ కొంగు కప్పుకుంటుంది. ఎంత ఇరుకు బజార్లో అయినా మరే ఇతర మగాడూ ఆమెకు పది అంగుళాలకన్నా దగ్గర కాలేకపోయాడు. ఇందుట్లో నాకు నచ్చని అంశాలే ఎక్కువ. అయినా, ఆమెను నేనెప్పుడూ విమర్శించలేదు. అసలు పట్టించుకోనూ లేదు. తనకిష్టమయిన విధంగా తను బతుకుతుంది. నా జోక్యమెందుకూ ఇక?

నిజానికి కురూపులకు పతివ్రతలుగాను, శీలవతులుగాను ఉండే అవకాశాలుఎక్కువ. ఒక్కోసారి తప్పనిసరికూడా కావచ్చు. కాని నా పెళ్ళాం వికృతంగా ఉండదు. ఆమె బజార్న వెళుతూంటె ఎంతమంది ఆమెపైపే నోళ్ళు తెరిచి చూస్తుంటారో నాకు తెలుసు.

ఆమె ఏ ఉద్యోగమూ చేయడంలేదు. ఆమె పోషణభారం పూర్తిగానూ, కేవలంగానూ నామీదే. అట్లాగని నేనెప్పుడూ ఆమెను హీనిసగా చూడలేదు. "ఎంత మంచి మొగుడు దొరికాడే నీకు" అని మా కాపురం చూసిన ఆమె స్నేహితురాలు ఆమెతో అనడం చెవులారావిన్నాను.

ఆమె కాపురానికి వచ్చినప్పటినుండి ఆమె ఏ కోరికకూ నేను అడ్డు చెప్పలేదు. "రోజూ పూలు తీసుకురండి" అంది పెళ్ళయిన వారంరోజుల తర్వాత ఓ రాత్రి. అప్పటినుండి ప్రతి రోజూ పూలు తెచ్చి ఆమె చేతి కిచ్చేవాడిని.

"షాపింగ్‌కు వెళదామండీ" అనేది. వెళ్ళేవాడిని. తన కిష్టమైన చీరలూ, జాకెట్ పీసులూ తీసుకునేది. అది బావుందని, ఇది బాగోలేదని నేనెప్పుడూ కామెంట్ చేయలేదు. నా బట్టలు తీసుకొనే హక్కుకూడా ఆమెకే యిచ్చాను.

"సినిమాకు పోదామండీ" అనేది. పోయేవాడిని తనకు నచ్చిన సినిమాకు. నాకు కష్టం కలగనంతవరకు యెదుటివారికి కష్టం కలిగించకుండా ప్రవర్తించే స్వభావం నాది. పాపం! యింకా పెళ్ళ

కానీ కుర్రాళ్ళు ఆకలిగా చూసే వారు ఆమెవైపు సినిమా హాల్లో. చుట్టూ పైట కప్పుకొన్నా ఎత్తుగా కనిపించే ఆమె ఎదురందాలవైపు అయోమయంగా చూస్తూ ఉండిపోయేవారు. అప్పుడు మాత్రం ఆమెమీద కోపం వచ్చేది నాకు. ఆ కుర్రాళ్ళంటే నాకు ప్రత్యేకమైన జాలి. జీవితపు ఇంటి ముంగిట్లో అప్పటిదాకా చిన్నపిల్లల్లా ఆటలాడుకుని, వాకిట్లో తారట్లాడుతూ ఇంట్లోకి తొంగి చూసే కుతూహలం, ఆత్రుత వాళ్ళ కళ్ళల్లో కనిపిస్తాయి నాకు. ఆ ఇంట్లో ఎన్ని రకాల గదులుంటాయో వాళ్ళకు తెలీదు. ఏ రకపు గదిలో బందీ లవుతారో తెలియదు.

"ఎంత బావున్నారండీ ఈవేళ" అనో "మిమ్మల్ని ఎంతగా ప్రేమిస్తున్నానో తెలుసా?" అనో అనేది కొన్ని ప్రత్యేక సందర్భాల్లో. "అలాగా" అనేవాణ్ణి ఏమీ అనకపోతే బావుండదని.

ముందూ,వెనకా ఏ బాదరబందీలూ లేనివాణ్ణీ, నెలకు వెయ్యిరూపాయల జీతగాణ్ణీ కావడంతో ఆమె కోరికలు తేలిగ్గానే తీర్చగలిగేవాణ్ణి.


నేనొక మంచి మొగుణ్ణి కావాలని నేనెప్పుడూ ప్రయత్నించలేదు. "ఆలికి అన్నం పెట్టడం ఊరికి వుపకారమా." కాదన్న విషయం నాకు తెలుసు. ఆమె కూడా కృతజ్ఞతగా రాత్రిళ్ళు నా సెక్స్ వాంఛ చల్లార్చేది. ఆమెకాకాంక్ష వుండదా? నా కనుమానం. ఒకవేళ వున్నా, నా పట్ల కృతజ్ఞత చూపుకునే మార్గం అదొక్కటే.

అట్లా సుమారు అయిదు సంవత్సరాల సంసారంచేశాక ఓ వుదయం నా పెళ్ళామూ, కొన్ని నగలూ, ఆమె బట్టలూ మాయమయ్యాయి. వాటి బదులుగా ఉత్తరం మాత్రం టేబుల్‌మీద దొరికింది అంటే ఆ ఉత్తరం విలువ అంత అనా? ఏమో కావచ్చుకూడా.

పూజ్యులు, గౌరవనీయులు అయిన మాజీ శ్రీవారికి!

అయిదేళ్ళు మీతో సాంసారిక జీవితం అనుభవించాక ఈ ఉత్తరం వ్రాయవలసి వస్తోంది. ముందుగా మీకు నాకృతజ్ఞతలు. ఇన్నాళ్ళూ నే కోరినవన్నీ సమకూర్చారు. పుష్టికరమైన భోజనం, ఖరీదైన బట్టలు. ఓహ్! నే చెప్పిన ఏ పని చేయలేదు మీరు? అప్పుడప్పుడు చెలరేగే కామవాంఛ తీర్చారు. అందుకే మళ్ళీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. కాని మీరు పూర్తిగా మరచిపోయిన విషయం మనిషికి కేవలం భౌతికావసరాలేకాక, మానసిక అవసరాలూ ఉంటాయన్నది. భౌతికావసరాలు అవతలి మనిషి కళ్ళకు కనపడతాయి. కనిపించక పోయినా చెప్పొచ్చు "బట్టలు చిరిగిపోయాయండీ,బియ్యమయిపోయాయండి" అంటూ. మానసిక అవసరాలో! అవి ఏమిటో ఎలా ఉంటాయో అసలుంటాయనికూడా మీరు గ్రహించినటు లేదు. ఈ పద్దెనిమిదివందల రోజులుగా, పూలు తెస్తున్నారుగదా! ఏ రోజన్నా నా తలో పూలు మీరుగాపెట్టారా? "పెట్టమన్నాను" మొదటిరోజు పెట్టారు నిర్వికారంగా మెషీన్‌లా అదేదో ఫవర్






ఫిలిప్స్

ఆడియో విజన్
ప్రకాశం రోడ్, విజయవాడ-2.

చెవుడుకు చికిత్స

చెవినుంచి చీము కారడం, చెవిలో పెద్ద ధ్వని రావడం, చెవుడు లేదా చెవికి సంబంధించిన ఏదేని అనారోగ్యము పూర్తిగా నయము చేయబడును. ధర రు. 20/- పూర్తి కోర్సు రు. 50/- లు ఉపయోగపడనట్లు ఋజువైతే సొమ్ము వాపసు.

JANTA AUSDHALAYA (R 2)
PO. LALBIGHA (GAYA)

ఉచితము! ఉచితము!

తెల్ల మచ్చలు

అన్నిరకాల మచ్చలను, ఎఱుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మార్చును త్వరలోనే చర్మం మామూలు రంగు పొందును. ప్రచారం నిమిత్తం ఒక సీసా మందు ఉచితంగా పంప బడును. వెంటనే వ్రాయండి.

వివరాలకు :

Krishna Chandra Vaidaya (AJ)
P. o Katri Sarai (GAYA) INDIA

వాజ్‌లో ఉంచినట్టు. మనిద్దరమూ కలిసి నవ్వింది ఈ అయిదేళ్ళలో అయిదు సార్లయినా లేదే? ఎప్పుడన్నా చనువుగా, సరదాగా మాట్లాడారా? ఏ సందర్భంలోనయినా నన్ను ప్రశంసించడం కాని, తిట్టడంగాని జరగలేదే? ఇవన్నీ నోరు తెరిచి ఎలా అడగాలి? అడిగినా తీర్చగలిగే వారేనా? మీ స్వభావమే అంత. దాన్ని ఎట్లా మార్చాలి? భార్యా భర్తల మధ్యన ఉండవలసిన అనుబంధం, అన్యోన్యతా మన సంసారంలో ఎంతగా కరువయ్యాయో ఒక్కసారి ఆలోచిస్తే మీకే తెలుస్తుంది. ఏ పక్షితోనో, జంతువుతోనో ఆత్మీయత పెంచుకునే మనుషుల్ని చూశాముగాని మనిషితో అందునా భార్యతో కలిసిపోని మనిషిని మిమ్మల్ని ఒక్కర్నే చూస్తున్నాను. నా కోసం ఏం చేసినా మీరు ప్రేమతో మాత్రం చేయలేదు. ఒక కర్తవ్యం లాగా, బాధ్యతలాగా చూచుకుంటూ వచ్చారు నా అవసరాలు తీర్చడాన్ని. వెయ్యి రూపాయలు పెట్టి పట్టు చీర కొని పడేసినా రాని తృప్తి, కొనలేనని ప్రేమతో మొహాన్ని దగ్గరకు తీసుకొని లాలించి చెబితే వస్తుందని ఎటా చెప్పగలను మీతో? నేనూ ఓ మనిషినని, నాకూ భావాలుంటాయని, హృదయం స్పందించిన సమయాల్లో ఎవరితోనన్నా ముఖ్యంగా మీతోటి గొంతువిప్పి చెప్పుకోవాలని ఉంటుందని తెలిసికోలేకపోయారు. మీ మనసు తెలిపేమాట ఒక్కటయినా మాట్లాడారా మీరు? ఒక సుదీర్ఘ వాక్యమయినా మాట్లాడారా? యెప్పుడూ నా ప్రశ్నలకు ముక్తసరి జవాబులు తప్పించి? నా కామెంట్‌కు "అలాగా", "ఆహా" అన్న ముక్కలు తప్పించి? పెళ్ళయిన క్షణం నాకు మీరెంత పరిచితులో యిప్పటికీ ఆ సంబంధం అదే స్థితిలో వుండిపోవలసిన దుస్థితి కల్పించారు. అప్పటినుండి యిప్పటిదాకా మీ మొహంలో అదే ఫీలింగ్! అదే ఎక్స్‌ప్రెషన్! ఉత్సాహం లేదు. ఆవేశం ఆవేదన లేదు. నా పర్స్‌లో వెయ్యి రూపాయలు పోయాయన్నా అదే ఎక్స్‌ప్రెషను-మీకు ప్రమోషన్ వచ్చిందన్నా అదే ఎక్స్‌ప్రెషన్. రాత్రి ముద్దు పెట్టుకొనేటప్పుడూ అదే ఎక్స్‌ప్రెషన్! దేనికీ స్పందించనిది మీ గుండె! మీరొక యంత్రం! జీవితమంటే తప్పకుండా పని చేసేకానీ జీతంరానివుద్యోగం మీదృష్టిలో.

ఏ క్షణం రాకూడదని, నా మానసిక అశాంతిని అణచుకునేందుకు దైవభక్తిమీద మనసు నిలపడానికి ప్రయత్నించానో ఆ క్షణం రానే వచ్చింది. నాలో రగిలిపోయే అసహనం, అసంతృప్తి మీతోచే కలిసి జీవించాలన్న ప్రయత్నాన్ని విఫలం చేశాయి. మీలో ఏంలేక నేను మదనపడ్డానో అవే వున్న మనిషి తారసిల్లాడు. అతను బీదవాడయినా మనసు బీదదికాదు. నేను ఏం కోల్పోయి పిచ్చిదాన్నయిపోతున్నానో వాటికోసం అతనితో వెళిపోతున్నాను. అతనెవరో చెప్పను. నాకు తెలుసు మీరూహించి ఉండరు ఈ పరిణామం. అయినా నేనేం చేయలేకపోతున్నాను. మీరు మాటల్లోనూ, చేతల్లోనూ చూపని అపూర్వమైన అభిమానం అతను చూపుతున్నాడు. అన్నట్టు మీరు రెండో పెళ్ళి నిరభ్యంతరంగా చేసుకోవచ్చు. ఆమెకు ముందుగానే నా సానుభూతి అందజేయండి! ఆమె కూడా మీలాంటిదయితే సుఖపడటానికి అవకాశం ఉంటుందేమో! ఆమె నయినా మనిషిగానేకాక భార్యగాకూడా చూడండి. ఆమెతోనయినా సన్నిహితంగా మసలండి. ఆప్యాయతా, ఆత్మీయతా చూపడానికి ప్రయత్నించండి. బట్టలూ, నగలూ పట్టుకెళుతున్నందుకు క్షమించండి. దయచేసి నాకోసం వెతక్కండి. వెతికించకండి. క్షమించవలసిన అవసరం ఉందనుకుంటే క్షమించండి.

నాకు నమ్మకం మీకీ ఉత్తరం చదివాక మీ మొహం ఎప్పటిలాగా ఉంటుందని.

ఇట్లు
మీ ఒకప్పటి భార్య

అందుకే కాబోలు కొన్ని రోజులుగా బాధపడుతూ కన్పించింది. ఆమెకింత ఆలోచన, తెలివితేటలు ఉన్నాయని నేనెప్పుడూ అనుకోలేదు. అట్లాగని వుండటం ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదుకదా! అంతా ఖచ్చితంగానె ఆలోచించింది ఒకచోట తప్ప! నాకే ఫీలింగ్సూ, ఎఫెక్షన్సూ వుండవనుకొంది. ఉంటాయి కాని ఎక్స్‌ప్రెస్ చేయను. అంతే. హృదయంలో ఉన్నా, లేకున్నా ఆమెకు ప్రేమ, అభిమానం నటించాలి. నాకు అవి అబద్ధంగా అసంబద్ధంగా తోస్తాయి. ఆ పని నావల్ల కాదు లేక నేనామెను ప్రేమించలేకపోయానా!

మంచి పనే చేసిందామె. ఈ బాధనుంచి విముక్తి పొందింది. తనకు తృప్తి, శాంతి కలిగేచోటకు వెళ్ళగలిగింది. ఇంత బాధ ఎట్లా తట్టుకుందో? పదుగురిచేత పతివ్రత అనిపించుకున్న మనిషి యిలాంటిపని చేసిందంటే యెంతో కష్టపడే వుండాలి. ఆమె చేత పూజింపబడే దేవుడు ఆమెకు తను కోరుకున్న తృప్తి, శాంతి ప్రసాదించుగాక! వాట్ నెక్స్? నాకు వంట రాదుగనక హోటలుకు వెళ్ళటం మొదలుపెట్టాను ఆ పూటనుండీ.

ఆమె గుర్తుగా యింట్లో ఏమీ మిగలలేదు. ఫొటోలు తీసివేసింది. పిల్లలూ లేరు

మాకు. నా పురుషత్వంమీద నేనూ, తన స్త్రీత్వంమీద తనూ నమ్మకం పోగొట్టుకోవడం యిష్టంలేక ఏ డాక్టరుచేతా పరీక్ష చేయించుకోలేదు మేం. ఆ లెటరు ఫ్రేమ్ కట్టించి వుంచుదామనుకున్నాను. ఎక్కడో జారిపోయింది. విలువైంది కదా!

* * *

నా పతివ్రత పెళ్ళాం లేచిపోవడం పెద్ద సంచలనాన్నే కలిగించింది మా ఇంటి చుట్టుపక్కలా, మా ఫ్రెండ్స్ లోనూ. అందరూ వచ్చి అనవసరంగా సానుభూతి చూపారు. తర్వాత చాన్నాళ్ళు సంతోషించారు చాటుగా. అతనెవరో ఇంకా తెలియలేదు. తెలుసుకోవాలని ప్రయత్నించనూలేదు.

ఆ తర్వాత మూణ్ణెల్లి కనుకొంటాను ఓ ఉదయం ఎవరో తలుపు తడితే లేచి తీశాను. మా మామ కూతురు. నా మరదలు. ఎప్పుడో నాకిచ్చి పెళ్ళి చేద్దామని ప్రయత్నం జరిగింది.కాని ఆమె ఎవరినో ప్రేమించి తల్లితండ్రులతో పోట్లాడి పెళ్ళి అతన్నే చేసుకొంది. అప్పటినుండీ ఆమెకూ, వాళ్ళకు సంబంధం లేదట. ఇప్పుడిట్లా నా దగరకు వచ్చింది వంటరిగా.

"అబ్బ! ఏమిటి బావా అట్లా దెయ్యాన్ని చూసినట్లు చూస్తావు! లోనికి రానీయవా?"

"అబ్బే ఏం లేదు! రా లోపలికి!"

చిన్నప్పుడు నాతో చనువుగానే వుండేది.

"అయ్యో! యిల్లంతా యేమిటి యిట్లా దరిద్రంగా వుంది. అవునులే! మి ఆవిడ లేదుకదా యింకెట్లా వుంటుంది? ఎవడితోనో లేచి పోయిందటగా! ఎవరో చెప్పారు. అసలది తెలిశాకే నీ దగ్గరికి వచ్చాను."

"ఏమిటి విశేషాలు? అందరూ బాగున్నారా అని అడగవేం? అబ్బ ఏం మనిషివిలే నువ్వు? అప్పటికీ, యిప్పటికీ ఏం మారలేదు. అసలు నీకు నేను గుర్తున్నానా? నువ్వు రాకపోతే మానె కనీసం వుత్తరం ముక్కయినా రాశావా యెప్పుడయినా?"

ఏ ఆలోచనా, ఆధారమూలేకుండా అభాండాలు చేయడం ఆడవాళ్ళకే చేతనవునేమో! ఏదో ఒకటి అడక్క తప్పదు.

"ఒంటరిగా వచ్చావేం? మీ ఆయనా. పిల్లలూ ఏరి?"

"అమ్మయ్య ఎట్లాగయితేనేం అడిగేవు రెండు ప్రశ్నలు. ఇక ఇప్పుడు ప్రశ్నలూ, సమాధానాలూ లేవు. అన్ని సంగతులూ రాత్రికి వివరంగా చెప్తాను. ముందు నన్ను ఈ ఇల్లు బాగుచేసి వంట చేయనివ్వు."

* * *

రాత్రి భోజనాలయ్యాక మంచంమీద నాప్రక్కనే కూర్చుని అంది నా మరదలు:

"ఇదుగో ముందుగా చెప్తున్నాను. నువ్వేం ఆశ్చర్యపడి గుండె ఆపేసుకో కూడదు. నేను లేచిపోయి వచ్చాను."

లేచిపోయి వచ్చిందట! బాగుంది! ఈ ఆడాళ్ళ కింకేం పనిలేదా ఏమిటి? అయినా మగతోడి ఏడి మరి?

"ఏమిటి అట్లా చూస్తావు? నమ్మవా? నిజం, ఒట్టు" నా చేయి తీసికొని తన తల మీద పెట్టుకుని అంది. చేయి తీసుకుంటూ అన్నాను : "నమ్మకపోవడానికి ఏముంది ఇందులో? కాని ఎందుకు చేశావిట్లా?"

"నీకు మొదటినుండి చెప్పవలసిఉంది. నీకు తెలుసుగా మా వాళ్ళతో తెగతెంపులు చేసుకుని అతన్ని పెళ్ళిచేసికొన్నట్టు. అప్పుడతనికి ప్రైవేట్ ఫర్మ్‌లో ఉద్యోగం. అంత పెద్ద కుటుంబానికి మరే ఇతర ఆధారమూ లేదు ఆయన తప్ప. ఆ సీ అంతగా లేదు. ఐనా ఆ ఉద్యోగంమూలాన బాగానే ఉండేది మొదట్లో. రెండు సంవత్సరాల క్రితం అతని ఉద్యోగం పోయింది. ఆ ఫర్మ్ దివాలాతీసి. అప్పట్నించీ మొదలయ్యాయి కష్టాలు. ప్రేమలూ, కబుర్లూ కడుపు నింపలేవుగదా. ఒక పూట తింటే మరొకపూట పస్తు. చిన్నప్పట్నుంచీ నేనెట్లా పెరిగానో నీకు తెలుసు. అన్ని బాధలు ఎటా భరించానో? ఒకోరోజు ఆకలికి అర్ధరాత్రి లేచి ఆత్మహత్య చేసుకుందామనిపించేది. నాన్న వాళ్ళదగ్గరకి వెళ్ళాను. ఆయన ఏమన్నాడో తెలుసా: 'నేను తన కూతుర్నికాదట. మళ్ళీ సిగ్గులేకుండా ఎట్లా వచ్చావే. పోయి వాడితోనే చావు' అన్నాడు. ఆ బ్రతుకుమీదా, ఆ మనుషుల మీదా విరక్తి పుట్టింది. ఇంతలో తెలిసింది మీ ఆవిడ లేచిపోయిన విషయం. నీకూ ఒక ఆడమనిషి అవసరముంటుందనుకున్నాను. నీ ఇంట్లోనే నీతో ఉండిపోదామని వచ్చేశాను" ఆమె కళ్ళలో నీరు కదులుతోంది. తాననుభవించిన దారిద్ర్యాన్ని సూచిస్తూ. ఉగయమే ఎందుకు గమనించలేకపోయాను ఆమె దుస్తుల్లో పేదతనాన్ని.

"పిల్లల్ని వదిలేశావా?"

"పిల్లలెక్కడ వున్నారు? పెద్దాడు మూడేళ్ళవాడు చచ్చిపోయాడు. నాకు తెలుసు వాడు చచ్చిపోయింది మందులు లేకే. టానిక్కులవీ వాడక రెండోసారి ఎబార్షనయింది."

"అయినా నాతోటి ఉండటం ఎందుకు? నీకు డబ్బు యిసాను లేకపోతే మీ ఆయనకో వుద్యోగం చూసిపెడతాను. యింటికెళ్ళరాదూ?"

"చెప్పాగా! ఆ మనుష్యులమీద నాకసహ్యమని. నేనికి వాళ్ళతో కలిపి బ్రతకలేను. దరిద్రంలో మనుషులు ముఖ్యంగా బ్రతికి చెడమనుషులు ఎట్లా ప్రవర్తిస్తారో ప్రత్యక్షంగా చూశాను. అతన్ని ప్రేమించినందుకు, పెళ్ళి చేసుకున్నందుకు పశ్చాత్తాపపడవలసిన అవసరం కన్పిస్తోంది."

దరిద్రం ప్రేమను యింతగా తినేస్తుందా? ధనం ప్రేమను నటింప చేస్తుందే? ఇక నిజమైన ప్రేమ వూపిరి పీల్చేదెక్కడ?

ఒక అద్భుతమైన విషయం మెదడుకు తటింది. నా పెళ్ళాం ఏ మానసికావసరాలను కాంక్షించి భౌతికావసరాలను నిర్లక్ష్యం చేసిందో అవే భౌతికావసరాల కోసం నా మరదలు మానసికావసరాలను త్యజించి నా దగ్గరకు చేరింది. ఏ అంశమయితే తన జీవిత వలయాన్ని స్పృశించనైనా స్పృశించకుండా ఒకరు జాగ్రత్తపడతారో అదే అంశం తన జీవితానికి కేంద్రంగా తీసుకుంటారు మరొకరు. నిజంగా విరుద్ధ శక్తుల సంఘర్షణే జీవితమూ, ప్రపంచమున్నూ.

"మాట్లాడవేం బావా! నీ కిష్టం లేకపోతే చెప్పెయ్ నిర్మొహమాటంగా! వెళ్ళిపోతాను."

"నీకేం తక్కువని-ఇష్టముండదు."

నా తలను లాక్కొని తనకేసి బలంగా నొక్కుకుంది. నా చేతులామె నడుంచుట్టూ పాకాయి. నా మూడునెల్ల కోరిక ఆమెను గాఢంగా చుట్టుకొని, నా చేయి....

సారీ! కథ అయిపోయిందిక.

జీవితం చాలా.... ప్చ! ఏ వాక్యంతో టయితే ఈ కథ ఆరంభించ దలచుకోనేదో అదే వాక్యంతో ఈ కథ ముగించవలసిన అగత్యం యేర్పడిం దనిపిస్తుంది. నిజమే! జీవితం చాలా విచిత్రమైందే! అది సాధారణమయిన విచిత్రమే కావచ్చు. ఎనీహౌ అదే వాక్యాన్ని కొద్దిమార్పులతో రాసి కథ ముగించేస్తాను.

జీవితం సాధారణంగా విచిత్రమైంది.

